నడివీధి గంగమ్మకు నీరాజనం

- మేళతాళాల నడుమ సారె సమర్పణ
- ఆకట్టుకున్న ఓంశక్తి భక్తుల విన్యాసాలు




ఊరేగింపులో గంగమ్మకు మాల వేస్తున్న ఓంశక్తి భక్తుడు

చిత్తూరు కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో రెండు రోజుల నడివీధి గంగ జాతర బుధవారం కోలాహల వాతావరణంలో ముగిసింది.గంగమ్మకు జాతర వంశపారంపర్య ధర్మకర్తలు సీకేబాబు కుటుంబసభ్యులు, హేమంత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ స్థానిక పొన్నియమ్మ గుడిలో అమ్మవారి గజమాలకు, సారెకు పూజలు నిర్వహించారు. మేళతాళాలతో ఊరేగింపుగా బజారు వీధిలో కొలువుదీరిన నడివీధి గంగమ్మకు సమర్పించి నిమజ్జన ఊరేగింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయం నుంచి ఓంశక్తి భక్తులు శరీరాలపై శూలాలు గుచ్చుకుని ఆటోలు, ట్యాక్సీలు, లారీలు, ట్రాక్టర్లు, పొక్లయినర్లు లాగుతూ ప్రభుత్వాస్పత్రి, మార్కెట్ చౌక్, చర్చివీధి, హైరోడ్డులోని మాక్స్ వద్దకు రాగా, అదే సమయానికి బజారు వీధి, శేషాపిరాన్ వీధుల మీదుగా నడివీధి గంగమ్మను ఉత్సవ నిర్వాహకులు తీసుకువచ్చారు. ఓం శక్తి భక్తులు అమ్మవారికి పూలమాల సమర్పించారు.అనంతరం గంగమ్మను ఊరేగింపుగా కట్టమంచి చెరువులోకి తీసుకెళ్లి జలాధివాసం చేశారు.ఉత్సవ నిర్వాహకులు వెంకటేష్, గుణశేఖర్, వేమారెడ్డి, ఆర్‌ఎస్‌ఎల్‌ఎస్ సుబ్బు, సీఆర్సీ రవి, చుడా చైర్మన్ కటారి హేమలత, టీడీపీ నాయకులు దొరబాబు, చంద్రప్రకాష్, వసంత్ కుమార్, కాజూరు బాలాజి తదితరులు పాల్గొన్నారు.




జలాధివాసానికి పయనమైన గంగమ్మ


అమ్మవారికి సారెను తీసుకొస్తున్న సీకేబాబు, ఎమ్మెల్యే జగన్

11ఏళ్లుగా.. గప్‌చుప్‌గా

- జిల్లా కేంద్రంలో రహస్యంగా లింగ నిర్ధారణ కేంద్రం నిర్వహణ
- తమిళనాడు మహిళలే ఆదాయవనరు
- రెండు నెలల పాటు నిఘా వేసి పట్టుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్
- డీఎంహెచ్‌వోకు,డీసీహెచ్‌ఎస్‌కు నోటీసులు


స్కానింగ్ కేంద్రంలో అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలానికి పైగా చిత్తూరులో నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠాను కలెక్టర్ సుమిత్‌కుమార్ పట్టుకున్నారు.తమిళనాడు రాష్ట్రానికి చెందిన వైద్యశాఖ అధికారుల ఫిర్యాదుతో సుమారు రెండు నెలల పాటు నిఘా వుంచిన కలెక్టర్.. ఎవ్వర్నీ నమ్మకుండా ఒంటరిగా వెళ్లి పట్టుకున్నారు.పరీక్షా కేంద్రంతో పాటు యంత్రాలను సీజ్ చేసి.. 11 మంది గర్భిణుల్ని, ముగ్గురు నిర్వాహకుల్ని అదుపులోకి తీసుకున్నారు. నెలకు సుమారు రూ.10 లక్షలు సంపాదిస్తున్న ఈ ముఠా గురించి అనేక విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి.

కడుపులో ఉన్న బిడ్డ ఆడా, మగా చెప్పడం తీవ్రమైన నేరం. ఈ చట్టాన్ని తమిళనాడులో పటిష్టంగా అమలు చేస్తున్నారు. దీంతో అక్కడి గర్భిణులు పెద్దఎత్తున చిత్తూరులో నిర్ధారణ పరీక్షల కోసం వస్తున్నారు. ఈ విషయాన్ని అక్కడి వైద్యారోగ్య శాఖ అధికారులు ఇటీవల గుర్తించారు.చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి ఈ విషయాన్ని తెచ్చారు.చిత్తూరు నగరంలోని భరత్‌నగర్‌కాలనీలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న కలెక్టర్ సుమారు రెండు నెలలుగా నిఘా ఉంచారు. బుధవారం ఎస్పీ మణికంఠకు ఈ విషయమై సమాచారమిచ్చి భరత్‌నగర్‌కాలనీకి వెళ్లారు. స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ను ఎస్పీ అక్కడకు పంపించారు.ఆర్డీవో శ్రీనివాసుల్ని తాను వెళ్లిన చాలాసేపటికి లొకేషన్ పెట్టి కలెక్టర్ రమ్మన్నారు. ఆ తర్వాత కాసేపటికి తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డిని పిలిచి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఇంటిని, స్కానింగ్ పరికరాలను సీజ్ చేయించారు.స్కానింగ్ కేంద్రం వద్ద వున్న 11మంది గర్భిణుల్ని విచారించి వదిలేశారు.ముగ్గురు మహిళా నిర్వాహకుల్ని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.ఈలోపు పరారైన నిర్ధారణ పరీక్షలు చేసే వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.చిత్తూరు ఆస్పత్రుల్లోని ల్యాబుల్లో, స్కానింగ్ కేంద్రాల్లో, మెడికల్ స్టోర్స్‌లో పనిచేసే సిబ్బంది పదిమంది దాకా మహిళలను ఈ కేంద్రానికి పంపుతున్నట్లు అనుమానిస్తున్నారు. 2014 నుంచీ చిత్తూరులో ఇలా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.ఈ 11 ఏళ్లలో ఒక్క కేసూ నమోదు కాకపోవడం,వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యకరం.కలెక్టర్ నేరుగా కల్పించుకోవడంతో ఆ దిశగా కూడా విచారణ జరిగే అవకాశముంది. ఇప్పటికే కలెక్టర్ డీఎంహెచ్‌వోకు, డీసీహెచ్‌ఎస్‌కు నోటీసులు ఇచ్చారు.

● నెలకు రూ.10 లక్షల సంపాదన..

వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో మాత్రమే భరత్‌నగర్‌కాలనీలోని రేకుల ఇంట్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఈ మూడు రోజుల్లో సుమారు 50 మంది గర్భిణులు వస్తున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు నుంచి ఎక్కువగా గర్భిణులు హాజరవుతుండగా...... మన జిల్లావాసులు కూడా వస్తున్నారు. ఒక్కో గర్భిణి నుంచి రూ.5 వేల నుంచి రూ.6 వేల దాకా వసూలు చేస్తున్నారు.రూ.లక్ష విలువ చేసే యంత్రాలతో నెలకు రూ.10 లక్షల దాకా సంపాదిస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు 442మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 35 కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు 442 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో శ్రీనివాసులు తెలిపారు. ఫస్టియర్ ఇంటర్ జనరల్‌లో 7568 మంది విద్యార్థులకు గాను 315 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌లో 348 మందికి గాను 28 మంది,సెకండియర్ జనరల్‌లో 1556 మందికి గాను 88 మంది,ఒకేషనల్‌లో 119 మందికి గాను 11 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.సదుం, సోమల పరీక్షా కేంద్రాలను డీఐఈవో పరిశీలించారు. జిల్లా ప్రత్యేక అధికారి దయానందరాజు, కమిటీ సభ్యులు బాలసుబ్రమణ్యం, శరశ్చంద్రశేఖర్ 11 కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది 16 కేంద్రాలను పరిశీలించారు.

తిరుపతి ఐఐటీ అభివృద్ధికి రూ.2,300 కోట్లు

ఏర్పేడు, మే 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీకి కేంద్ర ప్రభుత్వం రూ.2,300 కోట్లు మంజూరు చేసినట్లు డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ నిధులతో ఐఐటీ ప్రాంగణంలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. 2015లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఐఐటీల్లో తిరుపతి ఐఐటీ ఒకటి. 2017-24 వరకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ1,100కోట్లు మంజూరు చేసింది. 2017 నుంచి ఏర్పేడు వద్ద ఐఐటీ ప్రాంగణంలో పనులు ప్రారంభమయ్యాయి. ఐఐటీని మరింత అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను మంజూరు చేసింది. ఇక్కడ చదువుకునే విద్యార్థులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి మా బోధన సిబ్బంది ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు' అని ఆయన వివరించారు.

వెదురుకుప్పం @ 42.7 డిగ్రీలు

చిత్తూరు కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. కత్తెర మాసం సందర్భంగా పెరుగుతున్న ఎండలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి.చిత్తూరులో బుధవారం గంగమ్మ జాతర సందర్భంగా దేవిని ప్రతిష్ఠించిన ప్రాంతాల్లో చెప్పులు లేకుండా వెళ్లేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా బుధవారం నాలుగు మండలాల్లో 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వెదురుకుప్పంలో అత్యధికంగా 42.7, అత్యల్పంగా రామకుప్పంలో 32.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.తవణంపల్లెలో 40.9డిగ్రీలు, శ్రీరంగరాజపురంలో 40.3, నగరిలో 40.1, గుడిపాలలో 39.7, చిత్తూరులో 38.7, బంగారుపాళ్యంలో 37.6, కార్వేటినగరంలో 37.5, పూతలపట్టు, పులిచెర్ల మండలాల్లో 37.2, యాదమరి, పెనుమూరు, గంగాధరనెల్లూరు, చౌడేపల్లి, విజయపురం, పాలసముద్రం, ఐరాల, నింద్ర మండలాల్లో 37.1 గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో 36.8, సోమలలో 36.7, సదుంలో 36.5, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం, రొంపిచెర్ల మండలాల్లో 36.1, వి.కోట, బైరెడ్డిపల్లి మండలాల్లో 34.7, పలమనేరులో 34, పుంగనూరులో 33.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఓ ఇంటివాడవుతున్న చంద్రబాబు!

25న కుటుంబ సమేతంగా గృహప్రవేశం ● ఏర్పాట్లను పరిశీలించిన నారా బ్రాహ్మణి

కుప్పం, మే 14(ఆంధ్రజ్యోతి): కుప్పం సమీపంలోని శాంతిపురం మండల పరిధిలో నిర్మిస్తున్న సొంత గృహప్రవేశం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 25వ తేదీని ముహూర్తంగా నిర్ణయించారు.24వ తేదీన కుప్పం రానున్న ఆయన మరుసటి రోజున సకుటుంబంగా స్వగృహ ప్రవేశం చేయనున్నారు. ఇంటి నిర్మాణ ఏర్పాట్లను చంద్రబాబు కోడలు, మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి బుధవారం పరిశీలించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజలకు దగ్గరగా ఉండాలన్న లక్ష్యంతో చంద్రబాబు సొంత ఇల్లు నిర్మించుకోవాలని తలిచారు. వైసీపీ అధికారంలో ఉన్న 2019-2024 మధ్య కాలంలో స్థలంకోసం ఆయన టీమ్ తరఫున స్థానిక నాయకులు అన్వేషణ సాగించారు. చివరకు శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ, శివపురం గ్రామ పరిధిలో రెండెకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలంలో ఇంటి నిర్మాణ అనుమతులకోసం పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీకేయం ఉడా)కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయనకు చాలాకాలం వరకు అనుమతి లభించలేదు. నాటి వైసీపీ పెద్దల ఒత్తిళ్లతో కారణాలేవీ చూపకుండానే పీకేఎం ఉడా అధికారులు అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేశారు. చివరకు అనుమతులు నిరాకరించారు. తాను ఏర్పాటు చేసిన సంస్థ అన్యాయంగా అనుమతులు నిరాకరించడంతో చంద్రబాబు ఆగ్రహానికి లోనయ్యారు. చివరకు కోర్టులో కేసు వేయడంతో 2023లో కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబుకు వద్దకు వచ్చి మరీ ఆయన సంతకం తీసుకుని పీకేఎం ఉడా అధికారులు ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు.


చంద్రబాబు ఇంటి సమీపంలో పార్కింగ్‌కోసం స్థలాన్ని చదును చేయిస్తున్న దృశ్యం

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

కడపల్లె వద్ద ఇంటిని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు కోడలు, మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి స్వయంగా పర్యవేక్షించారు. ఉదయం 9 గంటలకు ఇంటివద్దకు చేరుకున్న ఆమె 11 గంటల దాకా అక్కడే గడిపారు. ఇంటి పనులను పరిశీలించడంతోపాటు, 25న జరుగనున్న గృహప్రవేశ ఏర్పాట్లపై కూడా ఆమె భువనేశ్వరి బృందంతో చర్చించినట్లు సమాచారం. ఉదయం 11.30 గంటలకు తిరుగు ప్రయాణమైన బ్రాహ్మణి తన పర్యటన గురించి పార్టీలోని అత్యున్నత స్థాయి నేతలకు తప్ప వేరెవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డారు. ఎస్పీ మణికంఠ , డీఎస్పీ పార్థసారథి బుధవారం చంద్రబాబు ఇంటి వద్ద భద్రతా ఏర్పాటను పరిశీలించారు. ప్రజాసమూహం ఎక్కువగా కేంద్రీకృతమయ్యే ప్రాంతాలు, రూట్ మ్యాప్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పార్కింగ్ ఏర్పాట్లు, ఫైర్ సేఫ్టీ, అంబులెన్స్‌లు తదితర సౌకర్యాలపై సమీక్షించారు. మరోవైపు టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథ నాయుడి ఆధ్వర్యంలో ఆహూతుల వాహనాల పార్కింగ్‌కోసం స్థలాన్ని చదును చేసే పనులు ప్రారంభమయ్యాయి. అయితే చంద్రబాబు ఇంటి పరిసరాల్లోకి ఎవరినీ అనుమతించడం లేదు.గృహప్రవేశం నాడు సుమారు 10 వేల మందికి పైగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, అదే సమయంలో భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

శరవేగంగా ఇంటి నిర్మాణం

పలమనేరు-కుప్పం జాతీయ రహదారిలో చంద్రబాబు స్వగృహ నిర్మాణం ప్రతిపక్షంలో కొంచెం నత్తనడకన నడిచింది. అయితే 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఆయన ముఖ్యమంత్రి కాగానే నిర్మాణంలో వేగం పెరిగింది. ఇంకా తుది మెరుగులు దిద్దాల్సి ఉంది కానీ దాదాపు ఇంటి నిర్మాణం పూర్తయింది. దీంతో చంద్రబాబు స్వగృహ ప్రవేశానికి 25వ తేదీన ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు సమాచారం.ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి బృందం రెండుమూడు రోజుల క్రితమే కుప్పంలో దిగిపోయింది. తుదిమెరుగులు శరవేగంగా దిద్దడంతోపాటు గృహప్రవేశానికి అవసరమైన ఏర్పాట్లను ఆ బృందం పర్యవేక్షిస్తోంది. స్థానికంగా ఏదైనా అవసరమైతే తప్ప తెలుగుదేశం పార్టీ వర్గాలకు ఇందులో జోక్యం కల్పించుకునే అవకాశం ఇవ్వడంలేదు.

పాలిసెట్ టాపర్ లక్ష్మీప్రశాంతి

చిత్తూరు సెంట్రల్, మే 14(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు బుధవారం పాలిసెట్-2025 ఫలితాలు విడుదల చేసింది. 120 మార్కులకు గాను 117 మార్కులు సాధించి 267వ ర్యాంకుతో జి.లక్ష్మీప్రశాంతి జిల్లా టాపర్‌గా నిలిచింది. 112 మార్కులతో యు. సాయిప్రసన్న 1017 ర్యాంకు సాధించి ద్వితీయ, 111 మార్కులతో ఎస్.మితున్‌కృతిక్ 1310 ర్యాంకుతో తృతీయ స్థానంలో నిలిచారు. జిల్లా వ్యాప్తంగా 1808 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా 1718 మంది ఉత్తీర్ణత (95.02శాతం) సాధించారు. 1022 మంది విద్యార్థుల్లో 954 మంది ఉత్తీర్ణత (93.35 శాతం) సాధించగా, 786 మంది విద్యార్థినుల్లో 764 మంది ఉత్తీర్ణత (97.2 శాతం) సాధించారు.

17 నుంచి కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు

చంద్రగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ఉత్సవర్లను ఆలయం నుంచి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ, హనుమాన్ సమేత శ్రీరామ చంద్రమూర్తి, రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ఆస్థానం నిర్వహిస్తారు. 18వ తేదీ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరగనుంది. రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వీధి ఉత్సవం నిర్వహిస్తారు. పాల్గొనదలిచిన భక్తులు రూ.516 చెల్లించాల్సి ఉంటుంది. ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. కాగా, వసంతోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు కల్యాణోత్సవం, ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

యువతకు ఉపాధి కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, యూనివర్శిటీ కళాశాలల్లో ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా ఫీచర్ స్కిల్స్ ప్రణాళికలు రూపొందించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్లకు బ్యాడ్జీలు, సర్టిఫికెట్లను బుధవారం కలెక్టర్ అందించారు. నీతి అయోగ్ గౌరవ సలహాదారు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రతిసిద్ధ చెందిన విద్యాసంస్థలలో నాస్కాం ఫీచర్స్ స్కిల్స్ అనుసంధానం కోసం చర్యలు తీసుకుని భవిష్యత్తులో విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి కోర్సులను చేయడం వల్ల ఉపాధి అవకాశాలు ఎక్కువగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాస్కాం డైరెక్టర్ ఉదయ్‌శంకర్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

విజయం అంతంకాదు...ప్రయాణం మాత్రమే

చంద్రగిరి, మే 14 (ఆంధ్రజ్యోతి):విజయం అంతంకాదని, ప్రయాణం మాత్రమేనని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు అన్నారు. చంద్రగిరి మండలంల ఎ.రంగంపేట సమీపంలో గల మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో బుధవారం అచీవర్స్ డే నిర్వహించారు. ఎంబీయూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంబీయూ ప్రముఖులతో పాటు ఈ విద్యాసంవత్సరం ప్లేస్‌మెంట్ పొందిన 1,600మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.విద్యార్థులకు కంపెనీ ద్వారా సర్టిఫికెట్లు ప్రధానం చేసి, సత్కరించారు. అమెరికాలోని పెన్ స్టేట్ యూనివర్సిటీతో మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ (ఎంవోఏ)పై ఎంబీయూ సంతకాలు చేయనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఒప్పందంతో ఎంబీయూలో ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు ఎంబీయూలో రెండేళ్ల, అమెరికాలోని యూనివర్సిటీలో రెండు సంవత్సరాలు చదివే అవకాశముందని తెలిపారు.



విశ్వరూపానికి హారతి

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనరు మౌర్య

విశ్వరూప దర్శనానికి భక్తుల నిరీక్షణ



అమ్మవారి విశ్వరూపానికి వేసిన తెర

ఆలయానికి వస్తున్న పేరంటాల వేషధారి

విశ్వరూపం వద్దకు పేరంటాల వేషధారి సాంబ

కమిషనరు మౌర్యకు మట్టె అందిస్తున్న పేరంటాలు

ప్రతిమ మన్నును భక్తులకు పంచేసిన నిర్వాహకులు

చెంప తాకుతున్న సాంబ

మన్నుకోసం ఎగబడుతున్న భక్తులు

● ఫెస్టివ్ వైబ్స్ అదుర్స్

జాతర.. జయప్రదం

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతర జయప్రదమైంది. మంగళవారం ఒక్కరోజే లక్ష మందికిపై భక్తులు గంగమ్మను దర్శించుకున్నట్టు అంచనా. గతం కంటే పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తినా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాతర క్రతువు ముగియడంతో ఆధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈనెల 6వ తేదీన అర్ధరాత్రి అవిలాల నుంచి చాటింపుతో గంగజాతర సంబరం మొదలైంది. వారం రోజులపాటు జాతర వైబ్స్ నగరంతో పాటు చుట్టుపక్కల పల్లెలను చుట్టుముట్టాయి. రోజుకో వేషం.. చిత్ర, విచిత్రమైన అలంకారాలతో పలువురు భక్తులు గంగమ్మను దర్శించుకున్నారు. అక్కడక్కడా అలకలు, అరుపులు మినహా జాతర ఆద్యంతం అదిరిపోయింది. ఇక, వైకుంఠ దర్శన టోకెన్ల జారీలో దుర్ఘటన, ఇటీవల సింహాచలంలో గోడకూలిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య గంగజాతరపైనే ఫోకస్ పెట్టారు. 300 మంది పోలీసు బలగాలను మోహరింపచేశారు. ఆలయ పరిసరాలు శుభ్రంగా పెట్టేందుకు 200 మంది పారిశుధ్య సిబ్బంది ఏర్పాటుచేశారు. సచివాలయ ఉద్యోగులనూ జాతర విధులకు కేటాయించారు. ఇక, జాతర బాధ్యతలు చేపట్టిన కమిషనరు మౌర్య, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకున్నారు. వీఐపీ పాసులు లేకుండా చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల సపరివార సమేత హడావుడిని తగ్గించారు.

అప్పుడు రూ.2కోట్లు.. ఇప్పుడు రూ.20లక్షల్లోపే

వైసీపీ హయాంలో జరిగిన జాతరకు దాదాపు రూ.2 కోట్లు ఖర్చు పెట్టారు. సామూహిక జంతుబలులిచ్చి తెగిన తలలపై కర్పూర హారతులతో ఆలయ పరిసరాలను భీతావహంగా మార్చారు. వైసీపీ శ్రేణులే ఆలయం చుట్టూ చేరి హడావుడి చేసి, సామాన్య భక్తులకు చుక్కలు చూపించారు. ఈసారి జాతర ఖర్చు రూ.20లక్షల్లోపేనని ఆలయ అధికారులు చెబుతున్నారు. టీటీడీ, తుడా, కార్పొరేషన్ నుంచి ఎలాంటి ఆర్థికసాయం తీసుకోలేదు. సామాన్య భక్తులూ ఇబ్బంది పడిన సందర్భాలు కనిపించలేదు. సాధారణ క్యూలైన్‌లోని భక్తులకూ పది, పదిహేను నిమిషాల్లో అమ్మవారి దర్శనం అయింది.

క్రౌడ్ మేనేజ్మెంట్‌పై దృష్టిపెట్టాం

జాతర రోజున క్రౌడ్ మేనేజ్మెంట్‌పైనే దృష్టిపెట్టాం. పోలీసులదే ఆ క్రెడిట్. అదనపు బలగాలు మోహరించి క్యూలైన్లలో భక్తులు పడిగాపులు లేకుండా చూశాం. వీఐపీ లైను లేకుండా సాధారణ భక్తులనూ వదిలేయడంతో ఆలయప్రాంగణంలో రద్దీని తగ్గించగలిగాం. టీటీడీ ఏర్పాటు చేసిన గ్యాలరీలు ఉపయోగపడ్డాయి. విశ్వరూపం తయారు చేసేందుకు కొంత సమయం దర్శనం ఆపాల్సివచ్చింది. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా జాతర జయప్రదం కావడం సంతోషంగా ఉంది.

- మౌర్య, కార్పొరేషన్ కమిషనర్

తాత్కాలిక హుండీ ఆదాయం రూ10.66 లక్షలు

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీని బుధవారం సాయంత్రం లెక్కించారు. వీటిద్వారా రూ10.66లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. శాశ్వత హుండీలను గురువారం లెక్కించనున్నారు.

హోం స్టేలకు చట్టబద్ధత అవసరం

తిరుపతి(నేరవిభాగం), మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త విధానంలో ఏర్పాటవుతున్న హోం స్టేలకు చట్టబద్ధత అవసరమని జీఎస్టీ జాయింట్ కమిషనరు జాన్ స్టీవెన్సన్ పేర్కొన్నారు. తిరుపతిలో ఇటీవల హోటళ్లు, లాడ్జీలకు పోటీగా ఏర్పాటవుతున్న హోంస్టేలకు పన్నులు, ఇతర వివరాలు నిర్వాహకులు సమర్పించడం లేదని గమనించిన జీఎస్టీ సహాయ కమిషనరు శ్రీనివాసులు నాయుడు వీటిని క్రమబద్ధీకరించి, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం దాదాపు 100 మంది హోంస్టేల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. హోంస్టేలకు జీఎస్టీ అధికారుల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రోజుకు రూ.7500 అద్దె ఉన్న గదులకు 12 శాతం.. ఆపై వాటికి 18 శాతం పన్నులు చెల్లించాలన్నారు. 'మా ఇంటిని అద్దెకు ఇస్తే జీఎస్టీ కట్టాలా? మా ఇంట్లో అతిథులకు ఆతిథ్యం ఇస్తే మీకెందుకు జీఎస్టీ కట్టాలి? ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకొన్నప్పుడే పన్ను చెల్లిస్తున్నాం. మళ్లీ ఎందుకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి? కేరళలో టూరిజం విభాగం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చి హోం స్టేలను అనుసంధానం చేసేలా మాకూ వెసులుబాటు కల్పించాలి' అని కొందరు నిర్వాహకులు అధికారులను అడిగారు. ఇంటిని కమర్షియల్‌గా అద్దెకు ఇస్తే జీఎస్టీ చెల్లించాలని జీఎస్టీ జేసీ జాన్ స్టీవెన్సన్ స్పష్టంచేశారు. రూ20 లక్షల కంటే ఎక్కువ సంపాదించే వారే జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు రేణుక, నూర్జహాన్, సీటీవో అధికారులు పాల్గొన్నారు.



నిర్వాహకులతో సమావేశమైన జీఎస్టీ జేసీ స్టీవెన్సన్, సహాయక కమిషనరు శ్రీనివాసులు నాయుడు

'ఎర్ర' దొంగకు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం) మే 14(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమ నాయుడు కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా పీలేరు మండలం మారంరెడ్డిగారిపల్లికి చెందిన అరవ వెంకటనారాయణ రాజు, గుండ్లూరు చెంగల్ రెడ్డి, దళాలి నారాయణ రాజు 2021 జనవరి 11న విఠలం గ్రామం వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అప్పటి వాయల్పాడు ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది దాడులు చేశారు. తిరుపతి నుంచి మదనపల్లె వైపు వేగంగా వెళుతున్న కారును ఆపగా, ఆపలేదు. కొంతదూరం వెళ్లాక ఆ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చింతచెట్టును ఢీకొంది. వాహనంతో పాటు ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ సమయంలోనే గుండ్లూరు చెంగల్ రెడ్డి, దళాలి నారాయణ రాజు మృతి చెందారు. మిగిలిన నిందితుడు అరవ వెంకటనారాయణ రాజుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు.

చిన్నారుల రూ.లక్ష విరాళం



తిరుపతి(కలెక్టరేట్), మే 14(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో అసువులు బాసిన వీరజవాన్ల సహాయార్థం తిరుపతి నగరానికి చెందిన అనిరుద్, ఆశ్రీద్, సుచిత్ర రూ.లక్ష అందించారు. ఈ మేరకు చెక్కును బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు.

లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా రవికుమార్

తిరుపతి(కలెక్టరేట్), మే 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరుగా జి.రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కొబ్బరికాయలు సమర్పిస్తున్న పళనిస్వామి

తిరుమల, మే14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి,కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌పి మోహన్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీ భోబే ఉన్నారు. పళనిస్వామి దర్శనం అనంతరం అఖిలాండం వద్దకు చేరుకున్న కొబ్బరికాయలు సమర్పించారు.

పాలిసెట్, ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'విశ్వం' విద్యార్థుల హవా



ఏపీఆర్‌జేసీ టాపర్లను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

- ఏపీఆర్‌జేసీలో స్టేట్‌లో టాప్‌టెన్‌లో నాలుగుర్యాంకులు
- పాలిసెట్‌లో జిల్లాస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం

తిరుపతి(విద్య), మే14 (ఆంధ్రజ్యోతి): ఏపీప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీ ఆర్జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుపతిలోని 'విశ్వం' స్కూల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో వై.దేదీప్యకు 3వర్యాంకు, కె.మునిరూపేష్‌కు 7వ, జె.అంజలికి 9వ, మనీషాకు 10వ ర్యాంకు వచ్చిందన్నారు. వీరితోపాటు రేవంత్, అబ్దుల్‌ఖాదర్, యోగి, సమత, దేదీప్య, భవ్య, శ్రీగీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారన్నారు. పాలిసెట్‌లో ఎం.కావ్యశ్రీ 120కి117మార్కులతో బాలికలవిభాగంలో జిల్లాలో టాపర్‌గా నిలచిందని ఆయన తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్‌ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారి 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్ ప్రవేశ పరీక్షలతోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లోనూ తమ విద్యార్థులు ఏటా టాప్‌ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పోటీపరీక్షల సమాచారం కోసం 8688888803/02, 9399976999 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసివిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.

తిరుమలలో ఒడిశా భక్తుడి అదృశ్యం



నార్సింగ్‌నాయక్

తిరుమల, మే14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఒడిశాకు చెందిన నార్సింగ్ నాయక్(57) అనే భక్తుడు కనిపించకుండా పోయాడు. కోరాపుట్ జిల్లా, ఖతలపడారు గ్రామం నుంచి పది మంది కుటుంబ సభ్యులతో కలిసి 11న ఆయన తిరుమలకు వచ్చాడు. అదేరోజు రాత్రి 8.30 గంటలకు అఖిలాండం వద రద్దీలో కనిపించకుండా పోయాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈయన వివరాలు తెలిసిన వారు 94407 96769, 0877 2289027 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

తుడా కార్యదర్శిగా ఎన్వీ శ్రీకాంత్ బాబు



తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) కార్యదర్శిగా డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ బాబు నియమితులయ్యారు. పశు వైద్యశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ అయిన శ్రీకాంత్ ప్రస్తుతం శ్రీకాళహస్తి ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. డెప్యుటేషన్‌పై మున్సిపల్ శాఖకు బదిలీ అయిన ఆయన్ను.. ఖాళీగా వున్న తుడా కార్యదర్శి పోస్టులో ప్రభుత్వం నియమించింది. ఈ పోస్టులో ప్రాథమికంగా ఏడాది పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరు మహిళల నుంచి 24 కిలోల గంజాయి స్వాధీనం

రేణిగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళల నుంచి 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు అర్బన్ పోలీసులు తెలిపారు. బుధవారం రేణిగుంటలోని ఓ లాడ్జిలో ఒడిశాకు చెందిన ఇద్దరు మహిళలు అద్దెకు దిగారు. వీరి కదలికలు అనుమానంగా ఉండడంతో సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మహిళల గదిని తనిఖీ చేశారు. రెండు సూట్‌కేసుల్లో 24 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. ఇద్దరు మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విశాఖ ఏజెన్సీలో కొన్న గంజాయిని చెన్నైలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏర్పేడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కోళ్లవ్యాన్
- ఇద్దరు వ్యాన్ డ్రైవర్ల దుర్మరణం

ఏర్పేడు, మే 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని కోళ్ల వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో కోళ్ల వ్యాను డ్రైవర్, అతడికి సహాయంగా వచ్చిన మరో డ్రైవర్ దుర్మరణం చెందారు. ఈ ఘటన ఏర్పేడు మండలం మేర్లపాక టోల్ ప్లాజా వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కోళ్ల వ్యాన్ టోల్‌ప్లాజా వద్ద నేషనల్ హైవే పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ధర్మపురికి చెందిన కృష్ణన్ పెరుమాళ్(55), రామన్ మధు(40) అక్కడికక్కడే మృతి చెందారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కోళ్ల లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్, సహ డ్రైవర్ మృతదేహాలను ఎక్స్‌కవేటర్ సాయంతో వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రామన్‌మధు - కృష్ణన్ పెరుమాళ్ మృతదేహాలు



రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న సీఐ

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం

ఎర్రావారిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) ; శేషాచల అడవుల నుంచి తమిళనాడుకు ఎర్రచందనం తరలిస్తుండగా వాహనం సహా స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకట్రామణ తెలిపారు. మండలంలోని ఎల్లమంద క్రాస్ నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందని సమాచారం అందడంతో మంగళవారం రాత్రి ఎల్లమంద గ్రామంలో ఫారెస్టు సిబ్బంది నిఘా ఉంచారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో కారు వేగంగా ఎల్లమంద గ్రామం ఇరగంరెడ్డిగారి పల్లె రోడ్డు వైపు వెళుతుండగా వెంబడించారు. తూనికాకుల బండ వద్ద కారును వదిలేసి ఇద్దరు స్మగ్లర్లు పారిపోయారు. కారులో పరిశీలించగా 200 కేజీల బరువున్న 8 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని రేంజర్ తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్వో వెంకట్రామణ, ఎఫ్ఎస్వో మునిస్వామి నాయక్, ఎఫ్‌బీవోలు లక్ష్మీప్రసాద్, రాజేష్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

తిరుమలలో సెక్యూరిటీ అడిటింగ్ కమిటీ తనిఖీలు



ఆలయం వద్ద తనిఖీలు చేస్తున్న కమిటీ సభ్యులు

తిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో ఉద్రిక్తత నేపథ్యంలో సెక్యూరిటీ అడిటింగ్ కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం తిరుమలలో తనిఖీలు నిర్వహించారు. సభ్యులు సునిత్ గరుడ, ఆరిఫ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అధికారులతో కలిసి శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, ముఖ్య రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. భద్రతాపరంగా కీలకమైన అలిపిరి తనిఖీ కేంద్రం, కాలినడక మార్గాలు, శ్రీవారి పాదాల మార్గం, హథీరాంజీ మఠం, శ్రీవారి ఆలయ బూందీపోటు, మాడవీధులు, అన్నప్రసాద కేంద్రం, వైకుంఠం1, రింగురోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మరింత భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

గంగాభవానికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 14 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాభవాని ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును ఏపీ నర్సింగ్ కౌన్సిల్ నుంచి పొందారు. నర్సింగ్ రంగంలో ఈమె చేసిన కృషికి గుర్తింపుగా విజయవాడలో గల తుమ్మలపల్లె కళా క్షేత్రంలో చేపట్టిన నర్సుల దినోత్సవ సభలో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

గ్రామీణ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యం


బి.యాదగిరి

చిత్తూరు సెంట్రల్, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా పినాక ప్రజా సాధికార ట్రస్టు పనిచేస్తోందని సంస్థ వ్యవస్థాపకుడు యాదగిరి తెలిపారు.హైదరాబాదులో ఆదాయపు పన్ను అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న తాను గ్రామీణ విద్యార్థులకు తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో 2012లో ట్రస్టును స్థాపించి సేవలందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గురువారం నుంచి గ్రామీణ విద్యార్థులకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, కెరీర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ చదువుతున్న గ్రామీణ విద్యార్థులకు ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడం, జీవితంలో సాధన మార్గాలు తెలియజేయడంతో పాటు ఎంపిక చేసుకున్న రంగాల్లో గ్రామీణ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సివిల్స్‌పై దృష్టి పెట్టే వారికి ప్రత్యేక శిక్షణ, వ్యాపార రంగాల్లో రాణించాలని ఆశించే వారికి స్టార్టప్స్ బేస్డ్ అంశాలపై శిక్షణ ఇచ్చి, వారిలో మనోస్థైర్యం నింపడం జరుగుతుందన్నారు. ప్రతి సెంటర్‌లోనూ కనీసం వంద మంది విద్యార్థులకు 21 రోజుల పాటు ఇచ్చే శిక్షణా కాలంలో విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, మధ్యాహ్న భోజనం, దూర ప్రాంత విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు.విశ్రాంత ఏపీ అడ్వకేట్ జనరల్ కృష్ణమూర్తి, తిరుపతికి చెందిన ప్రగతి ఎన్జీవో డైరెక్టర్ రమణ సహకారంతో గురువారం నగరిలోని పుదుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో, 16నరాయచోటి బోసనగర్, శ్రీ శిరిడీ సాయి మహిళ జూనియర్ కళాశాల, మదనపల్లెలోని ప్రశాంత్ నగర్ జ్ఞానోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్, 18న పలమనేరు గుండుబావి ఎదురుగా శ్రీ విద్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తనతో పాటు మానసిక వ్యక్తిత్వ వికాస శిక్షకులు రాజారాం, లలిత కుమారి, రేణుక, రెడ్డప్ప, రఘునాథ్, శివ, మునస్వామి, గజేంద్ర, జయశ్రీ వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు.

రెవెన్యూ అంశాలపై అదనపు సీసీఎల్ఏ సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో అదనపు సీసీఎల్ఏ ప్రభాకర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, సర్వేశాఖ ఏడీ జయరాజ్, డీఆర్వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు. రీసర్వే, రెగ్యులరైజేషన్ జీవో, ఆన్‌లైన్ దరఖాస్తులు, రీవెరిఫికేషన్ హౌస్‌సైట్స్ పట్టా లబ్ధిదారులు, నీటి పన్ను తదితర అంశాలపై కాన్ఫరెన్స్ జరిగింది. రీసర్వేకు సంబంధించిన ప్రతి ఫైలు జేసీ విద్యాధరి వెరిఫికేషన్ చేస్తున్నారని కలెక్టర్ తెలియజేశారు. ప్రైవేటు భూములు, కోర్టు కేసులకు సంబంధించిన భూములను పరిశీలించి రీసర్వే పూర్తిచేస్తున్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఏవో కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సమీపంలో కారు దగ్ధం



తవణంపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంజన్‌లో మంటలంటుకొని నడిరోడ్డుపై కారు దగ్ధమైంది. తిరుపతికి చెందిన తేజ, తారక్, శివప్రసాద్ మండలంలోని టి.పుత్తూరులో జరుగుతున్న గంగ జాతర కోసం తమ బంధువుల ఇంటికి వచ్చారు. బుధవారం తిరుగు ప్రయాణంలో ఉండగా స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో కారు ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. కారులో ఉన్నవారు దిగి చూస్తుండగానే కారు పూర్తిగా కాలిపోయింది.

గృహనిర్మాణాలు చేపట్టేలా చూడండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహనిర్మాణాలు వెంటనే చేపట్టేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో హౌసింగ్ అధికారులతో గృహనిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 77,366 గృహాలు మంజూరు కాగా 50,539 గృహాలు పూర్తయ్యాయన్నారు. పునాది స్థాయిలో 8562 గృహాలు, రూఫ్‌లెవల్‌లో 4504 గృహాలు ఉన్నాయని వివరించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణాల మంజూరుపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్ధాంతరంగా ఆగిన గృహనిర్మాణాలు లబ్ధిదారులు తిరిగి చేపట్టేలా చూడాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన గృహాలకు ఎఫ్‌టీవోలు జనరేట్ చేయాలన్నారు. బిల్లుల చెల్లింపులు త్వరగా చేస్తామన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ గోపాల్‌నాయక్, హౌసింగ్ ఈఈలు, డీఈలు, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ కళాశాలలో వీసీఐ సభ్యుల తనిఖీలు

తిరుపతిరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలను బుధవారం వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) బృంద సభ్యులు పరిశీలించారు. మూడ్రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు వీసీఐ సభ్యులు డాక్టర్ తంగ్రైవేలు, మహారాష్ట్ర వెటర్నరీ అండ్ అనిమల్ సైన్సెస్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్పీ అవంధ్కర్ కలసి 10 కళాశాలల్లో డిపార్ట్‌మెంట్లను తనిఖీ చేశారని అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. ఫ్యాకల్టీ, సదుపాయాలు, ల్యాబ్‌ల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, ప్రొఫెసర్ ఎంవీఏఎన్ సూర్యనారాయణ పాల్గొన్నారు.




తిరుపతి గంగమ్మ విశ్వరూపం

చెంపనరికిన పేరంటాళ్లు ● ముగిసిన తిరుపతి జాతర


ఆలయానికి పేరంటాళ్ల రాక

తిరుపతి, మే14(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ విశ్వరూప దర్శనం.. చెంప నరుకుడుతో వారం రోజుల తిరుపతి జాతర వేడుక ముగిసింది. అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం మంగళవారం అర్ధరాత్రి నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తులు నిరీక్షించారు. ఈసమయంలో దర్శనం నిలిపి ప్రధాన గేట్లు మూసివేయడంతో పలువురు జనసేన కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కొందరు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో పేరంటాళ్ల వేషం ధరించిన కైకాల కులస్థుడు గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో గేటు మూసి ఉండటంతో పేరంటాళ్ల వేషధారి సాంబ అసంతృప్తిచెంది అలకబూనారు. ఆలయ మాజీ ఛైర్మన్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఇతర సిబ్బంది ఆయన్ను ఓదార్చి విశ్వరూపం వద్దకు తీసుకొచ్చారు. భక్తుల అమ్మవారి నామ స్మరణల మధ్య పేరంటాళ్లు చెంప నరికారు. ఆ ప్రతిమ మన్ను కోసం భక్తులు ఎగబడ్డారు. కాగా మంగళవారం అర్ధరాత్రి నుంచీ మగాళ్లు ఆడ వేషాలు ధరించి డప్పుల వాయిద్యాలతో బృందాలుగా ఏర్పడి చిందులేస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు సైతం పూనకంతో ఊగిపోతూ కనిపించారు. ఆలయానికి చేరుకుని వజ్రకిరీటధారి అయిన గంగమ్మను దర్శించుకున్న అనంతరం విశ్వరూప దర్శనం కోసం అక్కడే ఉండిపోయారు. చెంపనరుకుడు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య దంపతులు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు మహేష్ యాదవ్, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం గంగజాతర ప్రారంభం

● వైభవంగా వినాయక ఉత్సవం


పుష్పాలంకరణలో పూజలందుకున్న గంగమ్మ

కుప్పం, మే 14 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం గంగమ్మకు, ఆ పక్కనే కొలువైన ముత్తుమారెమ్మలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. పుష్ప మాలలతో శోభాయమానంగా అలంకరించారు. కర్పూర హారతులు ఇచ్చి, నైవేద్యాలు సమర్పించారు. రాత్రి వినాయక ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వినాయకస్వామిని పల్లకీపై ఊరేగించారు. భక్తులు పెద్దయెత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. 15వ తేదీన ముత్తుమారెమ్మ ఊరేగింపు, 16న ముత్తుమారెమ్మకు శేష వాహన సేవ, 17న సింహ వాహన సేవ, 18న అశ్వ వాహన సేవలు నిర్వహిస్తారు. 19వ తేదీన అమ్మవారి అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ముత్తుమారెమ్మ కండ్ల తెర తొలగించి ప్రత్యేక పూజారాధన, ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారు అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. ఈ సందర్భంగా పుష్ప పల్లకీ, గరిగె, సయ్యాండి, బాణ వేడుకలు వైభవంగా జరుగుతాయి. 20వ తేదీన గంగమాంబ శిరస్సు ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి శిరస్సుకు ఉన్న తెర తొలగించి, పట్టణంలో వీధివీధినా ఊరేగిస్తారు. ఈ సందర్భంగా గరిగె, బాణ వేడుకలు, పంబ వాద్యాలు, గారడీబొమ్మలాట, సేవగాండ్లాట, పలక డ్యాన్సులు వంటి జానపద కళల ప్రదర్శనలతో పట్టణం హోరెత్తిపోతుంది. చివరి రోజైన 21వ తేదీన అమ్మవారి విశ్వరూప సందర్శన ఉంటుంది. ఊరేగింపు తర్వాత తెల్లవారుఝామున ఆలయానికి తీసుకు వచ్చిన శిరస్సును, అప్పటికే గర్భాలయంలో ఉన్న మొండేనికి అమర్చడంతో అమ్మవారు విశ్వరూపంతో సాక్షాత్కరిస్తుంది. భక్తులు పెద్దయెత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు పెట్టి, కర్పూర హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించుకుంటారు. మొక్కులున్నవారు జంతు బలులతో అమ్మవారిని సంతృప్తి పరుస్తారు. అదేరోజు రాత్రి అమ్మవారి శిరస్సునుంచి కండ్లు తొలగించి జలావాసం చేయడంతో జాతర మహోత్సవాలు ముగుస్తాయి. చివరి రెండు రోజుల్లో నిర్వహించే అమ్మవారి శిరస్సు ఊరేగింపు, విశ్వరూప సందర్శనలకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటారు.

జాతర ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ

కుప్పంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర ఏర్పాట్లను బుధవారం ఎస్పీ మణికంఠ, డీఎస్పీ పార్థసారథితో కలిసి పరిశీలించారు. ఆలయంతోపాటు పరిసరాల్లో తిరిగి భక్తులకు అసౌకర్యం కలుగకుండా భద్రతా చర్యలు తీసుకోవాల్సిన విధానంపై స్థానిక అధికారులకు, ఉత్సవ కమిటీకి పలు సూచనలు చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య, ఎస్ఐ బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ ఈవో కమలాకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


పల్లకీపై వినాయకస్వామి ఊరేగింపు

స్విమ్స్‌లో రెట్టింపు స్థాయిలో వైద్య సేవలు

ఖాళీ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తాం ● గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో టీటీడీ ఛైర్మన్, ఈవో


అధికారులతో కలిసి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న టీటీడీ ఛైర్మన్, ఈవో

తిరుపతి(వైద్యం), మే 14(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో రోగులకు రెట్టింపు స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలను అందించి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా సహకరిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. స్విమ్స్‌లో ఆయన అధ్యక్షతన బుధవారం జరిగిన గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఉన్నత వైద్య సేవలపై టీటీడీ మాజీ ఈవో ఐవీ సుబ్బారావు అధ్యక్షతన నిపుణుల కమిటీ మూడు నెలలు అధ్యయనం చేసి నివేదిక ఇచ్చిందన్నారు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు నిర్ణయాలు చేపడతామన్నారు. స్విమ్స్‌కు ఏటా రూ.వంద కోట్ల వరకు టీటీడీ వెచ్చిస్తున్నట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. ఇక్కడ వైద్య సేవలు పొందేవారిలో ఎక్కువమంది నిరుపేద రోగులే ఉన్నారన్నారు. భావి అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్విమ్స్‌లో ప్లాన్ ప్రకారం నూతన భవనాల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. అన్ని విభాగాల పరిధిలో ఖాళీగా ఉన్న 597 పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. క్యాన్సర్ బాధితుల ఆరోగ్య భద్రత కోసం నిర్మిస్తున్న శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాలకు రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధంచేసి, ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ముందు 391 పడకల నూతన క్యాన్సర్ భవనాన్ని, అందులోని 5 ఆపరేషన్ థియేటర్లను, స్విమ్స్‌లోని పలు విభాగాలను, వైద్య పరికరాలను టీటీడీ ఛైర్మన్, ఈవో పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఈ సమావేశానికి ఎక్స్‌పర్ట్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఐ.వీ.సుబ్బారావు, సభ్యులు డాక్టర్ జేఎస్ఎన్ మూర్తి, తేజోమూర్తుల రామోజీ, విజయ్‌కుమార్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, టీటీడీ సభ్యుడు సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ హాజరవగా, ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, టీటీడీ సభ్యురాలు సుచిత్ర ఎల్లా, ఎండోమెంట్ సెక్రటరీ వినయ్ చంద్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

మంగళపల్లె విద్యార్థులకు కలెక్టర్ అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలం మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు 'లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదు కావడం గర్వకారణమని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో రికార్డ్స్ సాధించిన ఐదుగురు విద్యార్థులు గణిత ఉపాధ్యాయుడు హెచ్ అరుణ శివప్రసాద్‌తో కలిసి కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. విద్యార్థుల ప్రతిభ, రికార్డులు సాధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 9వ తరగతి చదువుతున్న ఎ. లహరి 'పై' యొక్క విలువలను, మొదటి వెయ్యి దశాంసాలను 4.55 నిమిషాల్లో, 10వ తరగతి చదువుతున్న కె. పునీత్‌సాయి వెయ్యి నుంచి 2000 వరకు 7.31 నిమిషాల్లో, ఎ.పి. హేమ 2001 దశాంసం నుంచి 3000 దశాంశాల వరకు 8.11 నిమిషాల్లోనూ, రేవతి 3000 దశాంశాల నుంచి 3600 దశాంశాల వరకు అతితక్కువ గడువులోగా 8 నిమిషాల్లో చెప్పింది. వీరి ప్రతిభను గుర్తించి లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వీరి పేర్లు నమోదయ్యాయి. వీరికి మెంటార్‌గా వ్యవహరించిన హెచ్. అరుణ శివ ప్రసాద్‌ను అభినందిస్తూ ఆ రికార్డులో నమోదుచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సంపంగి, భారతి, సంజీవి, పిళ్లారప్ప, పాపుదేశి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జయంతి తదితరులు పాల్గొన్నారు.

దుగరాజపట్నం

దశ తిరుగుతోంది!



● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో నౌకా నిర్మాణ కేంద్రం
● రూ.3,500 కోట్ల వ్యయం
● వేల మందికి ఉపాధి

పోర్టు ఆగిందన్న బాధ ఇంతకాలం వారిని పట్టి పీడించింది. ఇప్పుడదే స్థానంలో నౌకా నిర్మాణం ఏర్పాటుకు ఎన్డీయే ప్రభుత్వం సంకల్పించింది. దుగరాజపట్నంలో రూ.3,500 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఈ యూనిట్ స్థాపించేందుకు చర్యలు తీసుకున్నట్లు మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్ అధికారులతో సమావేశమయ్యారు. తమ ప్రాంత అభివృద్ధికి అడుగులు పడుతుండటంపై స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి


తూపిలిపాళెం సముద్రతీరంలో మత్స్యకారుల పడవలు

తిరుపతి జిల్లా వాకాడు మండలం దుగరాజపట్నం వద్ద 15 ఏళ్ల కిందట ఓడరేవు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనికి 2014లో తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, పామంజి, వాగ్రరు, శ్రీనివాసపురం గ్రామాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించారు. సుమారు 2,700 ఎకరాలు తూపిలిపాళెం రెవెన్యూపరిధిలో గుర్తించారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ నిలిచిపోయింది. విభజనహామీ చట్టంలోనూ దుగరాజపట్నం పోర్టును పొందుపరిచినా ఆ దిశగా ముందుకు సాగలేదు. ఇక్కడికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో కృష్ణపట్నం పోర్టు ఏర్పాటవడం.. దుగరాజపట్నం పోర్టు ఆగడంతో స్థానికుల్లో ఆవేదన నెలకొంది. ఈ క్రమంలో దుగరాజట్నం పోర్టు స్థానంలో తూపిలిపాళెంలో రెండు వేల ఎకరాల్లో రూ.3,500 కోట్లతో నౌకా నిర్మాణ కేంద్రం, ఓడల మరమ్మతుల యూనిట్ ఏర్పాటు చేసేలా ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో షిప్ బిల్డింగ్, రిపేర్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. నౌకా నిర్మాణ కేంద్రానికి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు మరో వెయ్యి ఎకరాలను సేకరించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్టుకు భూసేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పోర్టు నిర్మాణానికి 2,700 ఎకరాలను సర్వేచేసి గుర్తించి ఉండటంతో భూసేకరణ ప్రక్రియ మరింత సులభతరంగా, వేగవంతగా జరగనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సుమారు రూ.26,000 కోట్ల పెట్టుబడులు వచ్చే వీలుంటుందని అధికారుల అంచనా. ఇక, నౌకా నిర్మాణ కేంద్రం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 40 వేల మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు దక్కుతాయని అధికారుల సమీక్షలో సీఎం తెలిపారు. ఈ నిర్ణయంతో తమ ప్రాంతానికి మహర్దశ రానుందని స్థానికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు

ఎన్డీయే అధికారంలోకి రావడంతో గూడూరు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే చిల్లకూరు, కోట మండలాల్లో క్రిస్‌సిటీ పేరిట 10 వేల ఎకరాలకు పైగా భూముల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు కానుంది. ఈ మొదటి దశ పనులు చిల్లకూరు మండలంలో వేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటు కృష్ణపోర్టును అనుసంధానం చేసేలా చిల్లకూరు, కోట మండలాల్లో సాగరమాల రోడ్డు పనులు చేపట్టారు. ఇప్పుడు వాకాడు మండలంలోని దుగరాజపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటితో తీరప్రాంతాలలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనుంది.


తూపిలిపాళెం వద్ద సముద్రమార్గంలో వెళుతున్న నౌక

రూపుమారనున్న తూపిలిపాళెం

చిల్లకూరు, కోట, వాకాడు మండలాలల్లోని సముద్ర తీరాలలో తూపిలిపాళెం బీచ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఎవరైనా బీచ్‌కు వెళ్లాలంటే ముందుగా గుర్తొచ్చేది తూపిలిపాళెమే. ప్రశాంతమైన వాతావరణం, చల్లని అలల హోరు, ఆహ్లాదకరమైన సూర్యోదయం, సూర్యాస్తమయం వంటి దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు ఈ బీచ్‌ను ఇష్టపడతారు. ఇక, మత్స్యకారులూ ఇక్కడి నుంచే పడవలతో సముద్రంలోకి వేటకు వెళతారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయలేదు. కానీ, నౌకా నిర్మాణ కేంద్రం, ఇతర పరిశ్రమలు ఏర్పాటైతే తూపిలిపాళెం రూపురేఖలు మారడంతో పాటు పర్యాటకంగా బీచ్ అభివృద్ధి చెందనుంది.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు సారె సమర్పణ


గంగమ్మకు పుట్టింటి సారే తీసుకొస్తున్న భక్తులు

పలమనేరు, మే14 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో గంగమ్మ జాతర సందర్భంగా ఇక్కడి పాతపేట వేణుగోపాల స్వామి ఆలయం నుంచి బుధవారం భక్తులు సారె తీసుకొచ్చి సమర్పించారు. గ్రామ దేవత ఇక్కడి తిరుపతిగంగమ్మకు వేణుగోపాల స్వామి అన్నగా ఇక్కడి ప్రజలు భావిస్తారు. ఏటా మేలో మూడు రోజుల పాటు జరిగే గంగమ్మ జాతర సందర్భంగా వేణుగోపాలస్వామి పుట్టింటి ఆడపడచు తిరుపతి గంగమ్మకు సారె పంపుతారు. ఈక్రమంలో పురవీధుల్లో సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు.

రూ.35 లక్షలతో మదర్సా అభివృద్ధి పనులు


పనుల ప్రారంభం సందర్భంగా ప్రార్థనలు

రొంపిచెర్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలో రూ.35 లక్షలతో మదర్సా అభివృద్ధి పనులు చేపట్టినట్లు స్థానిక గ్రామ సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, టీడీపీ నాయకుడు రఫీ పేర్కొన్నారు. గురువారం మదర్సాలో పనుల ప్రారంభోత్సవంలో వారు పాల్గొన్నారు. ప్రార్థనలు చేసి స్వీట్స్ పంచిపెట్టారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మదర్సా పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రార్థలనకు నేలపై కూర్చునే సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో అక్రమ్, అష్రఫ్, ఖాదర్‌భాష, శ్రీపతి, లక్ష్మయ్య, బాబులాల్, షేక్.కరీముల్లా,అజరత్‌సబీవుల్లా పాల్గొన్నారు.

ముగిసిన మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చౌడేపల్లె, మే14(ఆంధ్రజ్యోతి):స్థానిక బజారు వీధిలోని అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఊంజల సేవతో ముగిశాయి. బుధవారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆది దంపతుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ వైభవంగా ఊంజల సేవను నిర్వహించటంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉభయదారులుగా ఆలయ నౌకర్లు వ్యవహరించారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి


పార్టీ కండువా కప్పి నివాళులర్పిస్తున్న ప్రేమ్‌కుమార్

కుప్పం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): వెండుగంపల్లె పంచాయతీ సీనియర్ కార్యకర్త ఎన్.రాచంద్రారెడ్డి అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పార్టీ కండువాను కప్పి నివాళులర్పించారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రామచంద్రారెడ్డి పంచాయతీ పార్టీ అధ్యక్షునిగా, ఎంపీటీసీగా పార్టీకి, ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోతే చర్యలు


సిబ్బందితో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, మే14(ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయ సిబ్బంది పనితీరు మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ సమీపంలోని 10వ వార్డు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందుబాటులో లేరంటూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజలు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఇకపై ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యాలయాలకు అవసరమైన పరికరాలు లేకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మున్సిపల్ డీఈఈ మహేశ్, ఏఈ కృష్ణవేణి పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, మే 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని మహిళలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డిలు అన్నారు. బుధవారం రామకుప్పం శివార్లలోని మండల సమాఖ్య భవనంలో బీసీ సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం శ్రీనివాసమూర్తి, వైస్‌ఎంపీపీ వెంకట్రామేగౌడు, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, నాయకులు చలపతి, అనసూయ, రామ్మూర్తి, మహ్మద్‌రఫీ, నరసింహులు, వెంకటాచలం, రామలింగారెడ్డి, జయశంకర్, కామరాజ నాయక్, మనోహర్, వెంకటరమణ, ఆదిల్, పెరుమాళ్, గెర్నిపల్లెసలాం, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై ఊరేగిన కల్యాణవెంకన్న



బైరెడ్డిపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్నుపల్లె కల్యాణవెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సింహ వాహనోత్సవం ఘనంగా జరిగింది. స్వామి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, బాణసంచాపేలుళ్ల మధ్య ఆలయమాడవీధుల్లో ఊరేగించారు. హనుమంత వాహనోత్సవం కూడా ఘనంగా జరిగింది. ధర్మకర్త నారాయణమొదలి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల, సదుం మండలాల్లో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పులిచెర్ల ఇన్‌చార్జి సీడీపీవో మల్లీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. రొంపిచెర్ల మండలం మోటుమల్లెల అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ (ఓసీ), సదుం మండలం యర్రాతివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ (ఎస్సీ)కి కేటాయించామన్నారు. ఈనెల 16 నుంచి 24 వరకు పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించామన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఆ మృతదేహం బెంగళూరు వాసిది

రామకుప్పం, మే 14(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని మిట్టపల్లె పెద్దచెరువులో సోమవారం కనిపించిన మహిళ మృతదేహం బెంగళూరు వాసిదిగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మహిళ వద్ద గల వంకాకు తిత్తిలో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా ఆమె పేరు రాజమ్మగా, భర్త పేరు గోపాల్‌గా గుర్తించారు. బెంగళూరులోని మురుగేష్‌పాళ్య వాసులుగా తెలుస్తోందని ఏఎస్‌ఐ రెడ్డిశేఖర్ తెలిపారు. రాజమ్మ ఇక్కడకు ఎందుకు శవమైందనేది దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు.

17న రామకుప్పం మండల మీట్

రామకుప్పం, మే 14(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగుతుందని ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

కాలువలో జారిపడి వృద్ధుడి మృతి



బైరెడ్డిపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. కామినేపల్లె గ్రామానికి చెందిన శంకరప్ప(85) బైరెడ్డిపల్లెకు వచ్చి బీసీకాలనీ సమీపాన శ్మశానస్థలం వద్ద కాలువలో ప్రమాదవశాత్తు జారిప మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మృతిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కుప్పం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడి ప్రభుత్వానికి అప్రదిష్ట తేవద్దని మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ సంబంధిత అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని వసనాడు పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో హరి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగజాతరకు చాటింపు

సోమల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంగజాతరకు బుధవారం చాటింపు వేశారు. ఈనేపథ్యంలోస్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆసాదివారు గంగజాతర నిర్వహణపై భక్తులకు పురాణకథలు వివరించారు. అనంతరం తోటి తలారులు పట్టణంలో చాటింపు వేశారు. ఈనెల 20న అమ్మవారి ప్రతిష్ఠ, రాత్రి పొలిమేరలో బోణాలు సమర్పించనున్నారు.

టీడీపీ నెల్లిమంద అధ్యక్షుడిగా సతీశ్


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యంనాయుడు

సోమల, మే 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో పార్టీ కోసం కష్టపడినవారికి గుర్తింపు ఉంటాదని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు అన్నారు. బుధవారం నెల్లిమందలో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సతీశ్, కార్యదర్శిగా సయ్యద్‌బాషాను కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు మాజీ సర్పంచు హరిప్రసాద్, కందూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పి. శ్రీనివాసులు, గుర్రప్పనాయుడు, పురుషోత్తం, రమేశ్‌నాయుడు, జయచంద్ర, ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటు


అమీద్‌ఖాన్‌ను సన్మానిస్తున్న గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, మే14(ఆంధ్రజ్యోతి):పలు పంచాయతీల్లో టీడీపీ కమిటీలు ఏర్పాటు చేసినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..దుర్గసముద్రం పంచాయతీ అధ్యక్షుడిగా సీనియర్ టీడీపీ నాయకులు అమీద్‌ఖాన్, దిగువపల్లె పంచాయతీ అధ్యక్షుడిగా భూషణ, కాగతి పంచాయతీ అధ్యక్షుడిగా రాధాకృష్ణ, కాటిపేరి పంచాయతీ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంరెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

చౌడేశ్వరి ఆలయంలో పెద్దిరెడ్డి పూజలు

రొంపిచెర్ల,చౌడేపల్లి, మే14 (ఆంధ్రజ్యోతి): పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూజలు చేశారు. సవ్వావాండ్లపల్లెలో విశ్వనాథనాయుడు కర్మక్రియలకు ఆయన హాజరయ్యారు. ఆయన వెంట ఎంపీపీ చిచ్చిలి పరుషోత్తంరెడ్డి, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, వైస్‌ఎంపీపీ విజయశేఖర్, వైసీపీనాయకులు పాల్గొన్నారు. చౌడేపల్లె మండలం ఎల్లంపల్లె, 29ఏ చింతమాకులపల్లె గ్రామాల్లో నూతన వధూవరులను ఆశీర్వదించారు. పరికిదోన సర్పంచ్ గృహప్రవేశాలకు హాజరయ్యారు. వైస్‌ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, మిద్దింటి శంకర్‌నారాయణ పాల్గొన్నారు.

ఇరుకు రహదారితో నిత్యం ఇక్కట్లు

● విస్తరణకు నోచని రామకుప్పం ప్రధాన రహదారి


రామకుప్పం ప్రధానరహదారిలో ఇదీ ట్రాఫిక్ పరిస్థితి

రామకుప్పం, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో ప్రజలకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. పలుసార్లు రహదారి విస్తరణకు ప్రయత్నాలు చేసినా కార్యరూపం దాల్చలేదు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా ఉండటంతో బస్సులన్నీ రహదారిపైనే నిలుస్తుంటాయి. రహదారికిరువైపులా ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వాహనాలు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ స్తంభించి పోతోంది. 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రహదారి విస్తరించాలని నిర్ణయించింది. అప్పటి కడ పీవో ఉషారాణి రహదారి విస్తరణతో పాటూ మూడు సర్కిళ్ళను సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. 40 అడుగుల మేర రహదారి విస్తరణకు మార్కింగ్ ఇచ్చారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రధాన రహదారిలో కొందరు భవన యజమానులైన అధికార, విపక్ష నేతలు విస్తరణ ప్రక్రియకు అడ్డుతగిలారు. దీంతో నామ మాత్రపు విస్తరణ చేపట్టి చేతులు దులుపుకొన్నారు. కొందరు దుకాణాల ముందు రేకుల షెడ్లు ఏర్పాటు చేయడంతో సమస్య మరింత జఠిలమైంది. 2017లో మరోసారి విస్తరణ తెర మీదకు వచ్చింది. రోడ్డు విస్తరణలో కోల్పోయే స్థలాలకు మెరుగైన నష్టపరిహారం అందించాలని కోరారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. విస్తరణ జరిగేంత వరకు కనీసం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చొరవ తీసుకోవాల్సి ఉంది.

గంగమ్మ జాతరలో సీసీ కెమెరాల నిఘా


కంప్యూటర్ ద్వారా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

పలమనేరు, మే14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో తిరుపతి గంగమ్మ జాతర పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో జరగనుంది. బుధవారం నుంచి మూడురోజుల పాటు జరిగే జాతర సందర్భంగా పోలీసులు, ఆలయ ఉత్సవ కమిటి చేసిన ఏర్పాట్లను బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ మణికంఠ గుడివద్ద పోలీసు అవుట్‌పోస్టును, అక్కడి కంప్యూటర్ ద్వారా పరిశీలించారు. తర్వాత అమ్మవారిని దర్శించుకొని ఆలయ అర్చకుల వద్ద ఆశీర్వచనం తీసుకున్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ఆలయం లోపల చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారి విశ్వరూప దర్శనం వేదికను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవలని ఆలయ ఉత్సవకమిటికి ఆయన సూచించారు. ఫైర్ కంట్రోల్ పరికరాలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ డేగల ప్రభాకర్, సీఐ నరసింహులు, ఎస్.ఐ స్వర్ణతేజ, ఆలయ ఉత్సవకమిటి చైర్మెన్ శ్రీధర్, ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి కేంద్రాలుగా పంచాయతీలు : డీపీవో


వి.కోటలో చెత్త పంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో సుధాకర్‌రావు

వి.కోట, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పంచాయతీలను స్వయం సమృద్ధి కేంద్రాలుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని డీపీవో సుధాకర్ రావు అన్నారు. బుధవారం వి.కోట పంచాయతీ ఆధ్వర్యంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి వానపాముల ఎరువు తయారు చేసి సేంద్రియ వ్యవసాయానికి అందిస్తున్నామని పంచాయతీ ఈవో శివశంకర్ ఆయనకు వివరించారు. ముదరందొడ్డి కేంద్రాన్ని డీపీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పనం కాకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో చెత్త నుండి తయారు చేసిన ఎరువులను విక్రయించడం ద్వారా రూ.12 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. రూ.22 కోట్ల మేర పన్నులు వసూలు చేసి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఉప ముఖ్యమంత్రి నుంచి అవార్డును కూడా అందుకున్నట్లు వరించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



పుంగనూరు, మే 14(ఆంధ్రజ్యోతి): గూడూరుపల్లెలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. బుధవారం వేదపండితులు సురేశ్ దీక్షితులు, పవన్‌కుమార్ దీక్షితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. క్రేన్ సహాయంతో జరిగిన ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. గూడూరుపల్లె ఆలయ అభివృద్ధికర్త, పుంగనూరుకు చెందిన ఎస్పీ మునస్వామయ్యశెట్టి విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులు, కుటుంబసభ్యులు ప్రతిష్ఠించి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, బెంగళూరు సుదర్శనరాజు, కె.బాలసుబ్రహ్మణ్యం శెట్టి, పురుషోత్తంరాజు, సత్యనారాయణ గుప్త, రంగనాయకులు గుప్త, అనంతరాం, చిన్నవెంకటరెడ్డి, రాజన్నశెట్టి, వెంకట్రామయ్య శెట్టి,ఆర్యవైశ్యసంఘ నాయకులు,పాల్గొన్నారు.

పెరగని టమోటా ధరలతో రైతుల దిగులు


సోమలలో కోసిన టమోటాలు

సోమల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో టమోటా రైతులు తీవ్ర సంక్షోభంలో అల్లాడుతున్నారు. ఎకరా సాగుకు రెండు లక్షలు ఖర్చు చేయల్సిన క్రమంలో 15కిలోల బాక్సు ధర రూ.30 నుంచి రూ.60కి మించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రవాణా, కోత కూలీలు కూడా రావడంలేదంటున్నారు. మండీల యజమానులు బాక్సులు కూడా ఇవ్వకపోవడంతో కోత కోసి పొలాల వద్దనే రైతులు ఎదురు చూస్తూ ఉన్నారు. డిమాండ్‌కు మించి ఉత్పత్తి కావడంతో ధరలు తగ్గి డీలా పడుతునారు. కోత తర్వాత ఒకరోజు ఆలస్యంగా మార్కెట్‌కు వెళితే 15కిలోల బాక్సు ధర రూ.40కి మించి రావడం లేదని ఆందోళన పడుతున్నారు. మండలంలో రైతులు ఈపర్యాయం 4వేల ఎకరాలకు మించి సాగు చేశారు. అలాగే కూలీల రేట్లు పెరిగి ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా అర్జున తపస్సు


వసంతాపురంలో అర్జున తపస్సు

గుడిపాల, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతాపురం గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం అర్జున తపస్సు వైభవంగా నిర్వహించారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సుమానుు ఎక్కారు. ఆయన పద్యాలు పాడుతూ విభూది పండ్లు, నిమ్మకాయలను భక్తులపైకి విసిరారు. సంతానం లేని మహిళలు విభూది, నిమ్మకాయలు దక్కించుకోవడానికి పోటీపడ్డారు. అనంతరం తపస్సు వద్ద వరపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, వసంతాపురం, బసవాపల్లె, తొమ్మిది గ్రామాల మహాభారత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని అత్తిమంజేరి గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాలలో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సంతానం లేని మహిళలు వరపడ్డారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ ధర్మకర్త కె.వెంకటరమణరాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సారా ఊట ధ్వంసం


ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

కుప్పం, మే 14 (ఆంధ్రజ్యోతి): నడిమూరు అటవీ ప్రాంతంలో బుధవారం కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్ ఆదేశాల మేరకు డీఆర్వో సమర్ బాషా ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. రెండుచోట్ల సుమారు 500 లీటర్ల సారా ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఇకమీదట నిరంతరం నాటుసారా స్థావరాలపై దాడులు చేసి ఊటను ధ్వంసం చేస్తామని, నిందితులు దొరికితే ఎక్సైజ్ అధికారులకు అప్పగిస్తామని అటవీ శాఖాధికారులు తెలిపారు.

జడ్పీ చైర్మన్ సందర్శన


సమావేశంలో జడ్పీ చైర్మన్

పుంగనూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం చిత్తూరు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సందర్శించారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డితో మాట్లాడారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు గురించి చర్చించారు. కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవాలు

చిత్తూరు కల్చరల్, మే14(ఆంధ్రజ్యోతి): నగరంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎనడివీధి గంగజాతరలు బుధవారం సాయంత్రం వైభవంగా నిమజ్జనోత్సవాలతో ముగిశాయి. గిరింపేటలో దుర్గాంబ ఆలయ ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ మాజీ చైర్మన్ విశ్వనాథ్, నగరపాలక డిప్యూటి మేయర్ ఆర్సీ చంద్రశేఖర్‌లు గజమాల, సారె సమర్పించారు. కొంగరెడ్డిపల్లెలో ఉత్సవ ధర్మకర్త శంకర్, 75 దొడ్డిపల్లెలోయుగంధర్, గోపాలకృష్ణ, మురుకంబట్టులో ఉత్సవ ధర్మకర్త నవీన్, మురకంబట్టు బైపాస్ ఇందిరమ్మ కాలనిలో స్థానిక ప్రజల సహకారంతో, కట్టమంచిలో ఉత్సవ ధర్మకర్త శివారెడ్డి, గ్రామస్థులు నడివీధి గంగమ్మల నిమజ్జన కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు.

మొరుంపల్లె బీటీ రోడ్డుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మురళీమోహన్

ఐరాల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరుంపల్లె బీటీ రోడ్డు నిర్మాణానికి బుధవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్క పని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో మరిన్ని నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మొరుంపల్లె నుంచి చిన్న గొల్లపల్లె వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

బంగారుపాళ్యం,మే14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ రాగిమానుపెంట ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు జీసెస్ జెస్లింగ్ చర్చి పాస్టర్ డాక్టర్ కిరణ్ బాబు తెలిపారు. బుధవారం చెన్నైలోని శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 90 మంది రోగులు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు శంకర్‌నేత్రాలయ సిబ్బంది మురళీ కృష్ణా తెలిపారు.

మొరుంపల్లె బీటీ రోడ్డుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరుంపల్లె బీటీ రోడ్డు నిర్మాణానికి బుధవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్క పని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో మరిన్ని నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మొరుంపల్లె నుంచి చిన్న గొల్లపల్లె వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, దిలీప్‌రెడ్డి, నరసింహులునాయుడు, దయానంద పాల్గొన్నారు.

చెర్లోపల్లిలో వనమహోత్సవం


చెర్లోపల్లి గ్రామంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఎస్వీ యూనివర్సిటీకి చెందిన అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు బుధవారం మూడవ రోజుకు చేరింది. ఈ క్రమంలో గ్రామంలో వనమహోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పాఠశాల, ఆలయాలు, అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. 'సే నో టూ ప్లాస్టిక్' అంటూ గ్రామంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఎన్‌ఎస్‌ఎస్ హెడ్ శైలజ, పీఆర్ ప్రశాంతి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో మెరిసిన పీఈఎస్ విద్యార్థులు


సుప్రిత, శ్రేష్టాశెట్టి, అరవింద్, వినయ్

యాదమరి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన 10, 12 తరగతుల విద్యార్థులు 2024-25 సీబీఎస్‌ఈ పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించి మరోసారి సత్తాచాటారు. బుధవారం విడుదలైన సీబీఎస్‌ఈ ఫలితాల్లో 10వ తరగతికి చెందిన ఆర్.సుప్రిత 93%, శ్రేష్ఠశెట్టి 92% ఫలితాలు సాధించారు. 12వ తరగతిలో ఎంపీసీ విభాగంలో టి.అరవింద్ 91%, జె.వినయ్ 86% ఫలితాలు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, వారి విజయానికి కారకులైన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు యాజమాన్యం తరపున పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి. కృష్ణబాబు అభినందనలు తెలియజేశారు.

ప్రభుత్వసేవలు పారదర్శకంగా అందాలి


ఉద్యోగులవద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో సతీష్

గంగాధరనెల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపరంగా అందిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాల సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని ఎంపీడీవో సోమలరాజు సతీష్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. గంగాధరనెల్లూరు, ముక్కళత్తూరు సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీచేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. పన్నుల వసూళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు చంద్ర, కిరణ్‌కుమార్, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ మనోహర్ బాబు, సచివాలయం సర్వేయర్ వాసు, డిజిటల్ అసిస్టెంట్ సుమిత్రాదేవి పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి


పాలసముద్రం సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి వెంకటరమణ

పాలసముద్రం, మే 14(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం పాలసముద్రం, ఆముదాల సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయాలకు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, ఎంఈవో-2 గిరిజ, ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం, మజ్జిగ, తాగునీరు పంపిణీ

చిత్తూరు కల్చరల్, మే14 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండు రోజుల గంగజాతరలో పాల్గొన్న భక్తులకు పలుచోట్ల దాతలు ముందుకువచ్చి అన్నదానాలు, తాగునీరు, మజ్జిగ, ఇతరత్రా ప్రసాదాలను వితరణ చేశారు. స్థానిక పొన్నియమ్మ ఆలయం వద్ద పొన్నియమ్మ గుడి వీధి వర్తకుల ఆధ్వర్యంలో గంగజాతర నిర్వాహకులు సీకే బాబు భక్తులకు అన్నదానం చేశారు. రాముల గుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, తాగునీరు అందించారు. చిత్తూరు కరుణీకర్ సంఘం నాయకులు బజారువీధి నడి వీధి గంగమ్మ భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. వీరితో పాటు పలువురు దాతలు భక్తులకు పలు రకాలైన పళ్లరసాలు, అన్న ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో వెంకటేష్, గుణశేఖర్ పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



ఐటీఐ విద్యార్థులకు సూచనలిస్తున్న సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్

విజయపురం, మే 14(ఆంధ్రజ్యోతి): యువత పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై సూచనలిచ్చారు. ఐటీఐ విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు బ్యాంకులు స్వయం ఉపాధి కోసం రుణాలు అందిస్తున్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌటిల్య కళాశాల సీనియర్ మేనేజర్ ఏఎన్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో శ్యామ్ సుగుణకుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు అర్బన్ పరిధిలోని జాన్సన్‌గార్డెన్‌లో మెయిన్ అంగన్వాడీ వర్కర్(ఓసీ), లెనిన్ నగర్‌లో హెల్పర్(ఓసీ), గుడిపాల మండలం రామభద్రాపురంలో హెల్పర్ (ఎస్సీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కొంగారెడ్డిపల్లెలోని ప్రభుత్వ ఐటీఐ పక్కనే ఉన్న ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులను తీసుకోవాలన్నారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

గంగాధరనెల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు అర్హులైన మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో తిరువీధికుప్పం అంగన్వాడీ కేంద్రం హెల్పర్ పోస్టు ఓసీలకు, కోటాగరంలో హెల్పర్ పోస్టు ఎస్సీలకు, కలిజవేడులో హెల్పర్ పోస్టు ఓసీలకు, పెనుమూరు మండలంలోని బలిజపల్లె హెల్పర్ పోస్టు ఓసీలకు, పాలసముద్రం మండలంలోని కె.జె.పురం (క్రిష్ణజిమ్మాపురం)లో హెల్పర్ పోస్ట్ ఓసీలకు కేటాయించారని వివరించారు. దరఖాస్తులను ఈనెల 16 నుంచి 24వతేదీ సాయంత్రంలోపు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

రైతు నాయకుడికి ఎమ్మెల్యే గురజాల పరామర్శ



చిత్తూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని శెట్టింతంగల్ గ్రామానికి చెందిన చిత్తూరు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షుడు దేవరాజులు నాయుడు ఇటీవల ప్రమాదంలో గాయపడి ఇంట్లో చికిత్స పొందుతున్నాడు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనవెంట జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ ఉన్నారు.

జాతర వేడుకల్లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


కీళపట్టులో గంగమ్మ తల్లికి మొక్కుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మే14 (ఆంధ్రజ్యోతి): నగరి పరిధిలో గల కరకంతాపురం, కీళపట్టు, మూలనత్తం, ఎంకొత్తూరు, కృష్ణరామా పురంలలో జరిగిన జాతర వేడుకలలో ఎమ్మెల్యే భానుప్రకాష్ పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు.

సీబీఎస్‌ఈలో అమరరాజా ఉత్తమ ఫలితాలు

తవణంపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షల్లో మండలంలోని దిగువమాఘంలో గల అమరరాజా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ తెలిపారు. పదో తరగతిలో పి.లేఖన 475 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా ఎ.బేబి జిత్య 469 మార్కులతో ద్వితీయస్థానం, టి.తనీష్ 461 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. 12వ తరగతిలో కెల్విన్ ఓం 443 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా జి.కావ్య 412 మార్కులతో ద్వితీయస్థానం, అఖిల్ 409 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గల్లా రామచంద్రనాయుడు అభినందించినట్లు ప్రిన్సిపాల్ జయశ్రీ తెలిపారు.

వసంతాపురం-కొత్తపల్లె రోడ్డుకు రూ.1.69 కోట్లు మంజూరు

గుడిపాల, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతాపురం నుంచి కొత్తపల్లె వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 1.69 కోట్ల నిధులు మంజూరైనట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఏఈ ప్రసాద్ బుధవారం తెలియజేశారు.

జాతర సందడి


చిత్తూరులో పూజలందుకుంటున్న గంగమ్మ


గరగలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు





శూలాలు గుచ్చుకుంటున్న భక్తులు, శరీరానికి కొక్కీలు తగిలించుకుని వేలాడుతున్న ఓంశక్తి భక్తులు

ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలు



నగరిలో మాట్లాడుతున్న అధికారులు

నగరి/విజయపురం, మే 14(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగులో నాలుగు సంవత్సరాల నుండి దిగుబడి పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోసలనగరం రైతు భరోసా కార్యాలయంలో, నగరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోద్రేజ్ కంపెనీ నిండ్ర, నగరి, విజయపురం మండలాల వారికి ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రజినీకుమారి, రాఘవేశ్వర్‌యాదవ్, ఉద్యానవన శాఖాధికారి లోకేష్, గోద్రేజ్ డీజీఎం మురళి, రైతు సేవా కేంద్ర సిబ్బంది పవిత్ర, కల్పన, విజయ్, ప్రియ, నాగరాజు, శోభ, ప్రేమ్, ఉదయ్, రేష్మ, పలువురు రైతులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ టాపర్లుగా బృందావన్ విద్యార్థులు


రూబిని, సంతోష్, చరణ్‌కుమార్, తేజశ్రీ

చిత్తూరు సెంట్రల్, మే 14(ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ విడుదల చేసిన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో స్థానిక సంతపేటలోని బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి నగర టాపర్లుగా నిలిచారని కరస్పాండెంట్ శైలజకుమారి తెలిపారు. టెన్త్ సీబీఎస్‌ఈ ఫలితాల్లో 500 మార్కులకు గాను ఎస్.రూబిని (473) మార్కులు సాధించి టాపర్‌గా నిలవగా, పి.కె.సంతోష్ (467), ఆర్.జ్యోత్స్న, బి.జయప్రసన్నలు (439), డి.డీరజ్ విఘ్నేష్ చౌదరి (415), పి.జ్యోత్స్న, కె.మోనిష్‌బాబులు (411) మార్కులు సాధించారని వెల్లడించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో 500 మార్కులకు గాను ఎ.చరణ్ కుమార్ (472) మార్కులు సాధించి టాపర్‌గా నిలవగా, ఇ.తేజశ్రీ (443), సి.రెడ్డి కృష్ణకుమార్ (429), ఎస్.జీవన (428), టి.ప్రణవ్ సాయి (411) మార్కులు సాధించారని వివరించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ ప్రియతేజ, అధ్యాపకులు, అభినందించారు.

ఘనంగా నిమజ్జనోత్సవాలు



మాక్స్ సెంటర్ వద్ద సంగీత కచ్చేరి, నిమజ్జనానికి బయలు దేరిన సంతపేట గంగమ్మ

చిత్తూరు కల్చరల్, మే14(ఆంధ్రజ్యోతి): నగరంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న నడివీధి గంగజాతరలు బుధవారం నిమజ్జనోత్సవాలతో ఘనంగా ముగిశాయి. గిరింపేటలో దుర్గాంబ ఆలయ ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ మాజీ చైర్మన్ వి.కె.విశ్వనాథ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ చంద్రశేఖర్‌లు అమ్మవారికి గజమాల, సారె సమర్పించి నిమజ్జనం నిర్వహించారు. అదే విధంగా కొంగారెడ్డిపల్లెలో ఉత్సవ ధర్మకర్త శంకర్, 75 దొడ్డిపల్లెలో యుగంధర్, గోపాలకృష్ణ, మురుకంబట్టులో ఉత్సవ ధర్మకర్త నవీన్, మురకంబట్టు బైపాస్ ఇందిరమ్మ కాలనీలో స్థానిక ప్రజల సహకారంతో, కట్టమంచిలో ఉత్సవ ధర్మకర్త శివారెడ్డి, గ్రామస్తులు నడివీధి గంగమ్మల నిమజ్జన కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇదిలా ఉండగా సంతపేటలో ఉత్సవ ధర్మకర్త భూపేష్ గోపినాథ్, మంగసముద్రంలో గ్రామస్తులు, మంగసముద్రం హౌసింగ్ కాలనీలో ఉదయ్‌కుమాల ఆధ్వర్యంలో ఏక కాలంలో ఒకే చోట మూడు గంగమ్మలకు నిమజ్జనం నిర్వహించారు.

కత్తెరపల్లె పీహెచ్‌సీ సమస్యలు పరిష్కరిస్తాం

- జిల్లా టీకా అధికారి


తనిఖీ చేస్తున్న టీకా అధికారి డాక్టర్ హనుమంతరావు

వెదురుకుప్పం, మే 14(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని జిల్లా ఇమ్యునైజేషన్(టీకా) అధికారి డాక్టర్ హనుమంతరావు తెలియ జేశారు. బుధవారం ఆయన పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బంది తమకు ఎదురవుతున్న ఇబ్బందులను, ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి పూట మందుబాబులతో ఇక్కట్లు పడుతున్నామని పేర్కొన్నారు. సిబ్బందితో అసభ్యంగా వ్యవహరిస్తూ ఉన్నారని, ఆస్పత్రి ఆవరణలోనే మూత్ర విసర్జన చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారని వాపోయారు. ఆకతాయిల ఆగడాలు అరికట్టాలని కోరారు. అలాగే వర్షం వస్తే భవనం ఉరుస్తోందన్నారు. మౌలిక వసతులు కరువయ్యాయని పేర్కొన్నారు. పోలీసు యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఆకతాయిలకు అడ్డుకట్టవేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగజాతర

పూతలపట్టు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గంగమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. ఎం. బండపల్లి గ్రామంలోని నడివీధి గంగమ్మ తల్లికి భక్తులు పసుపు, కుంకుమ, చీర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బండపల్లి గ్రామ చివరన ఉన్న దుర్గమ్మ గుడి వద్ద నుంచి సుమారు రెండు కి.మీ దూరంలో వున్న నడివీధి గంగమ్మకు ఓంశక్తి భక్తులు తమ శరీరాలకు కొక్కీలు గుచ్చుకుని వాహనాలపై విన్యాసాలు చేస్తూ అమ్మవారికి గజమాల సమర్పించారు. అనంతరం అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ చెరువుల్లో నిమజ్జనం చేశారు.




భక్తులకు దర్శనమిస్తున్న గంగమ్మతల్లి, నోటికి శూలాలు గుచ్చుకొని, శరీరానికి కొక్కీలు తగిలించుకొని మొక్కులు తీర్చుకున్న భక్తులు

వైభవంగా అర్జున తపస్సు


వసంతాపురంలో నిర్వహించిన అర్జున తపస్సు

గుడిపాల, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతాపురం గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం అర్జున తపస్సు వైభవంగా నిర్వహించారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సుమాను ఎక్కారు. ఆయన పద్యాలు పాడుతూ విభూది పండ్లు, నిమ్మకాయలను భక్తులపైకి విసిరారు. సంతానం లేని మహిళలు విభూది, నిమ్మకాయలు దక్కించుకోవడానికి పోటీపడ్డారు. అనంతరం తపస్సు వద్ద వరపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, వసంతాపురం, బసవాపల్లె, తొమ్మిది గ్రామాల మహాభారత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని అత్తివరంజేరి గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాలలో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సంతానం లేని మహిళలు వరపడ్డారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ ధర్మకర్త కె.వెంకటరమణరాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

బంగారుపాళ్యం,మే14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ రాగిమానుపెంట ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు జీసెస్ బెస్లింగ్ చర్చి పాస్టర్ డాక్టర్ కిరణ్ బాబు తెలిపారు. బుధవారం చెన్నైలోని శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్‌నేత్రాలయ సిబ్బంది మురళీకృష్ణ, టీడీపీ నాయకులు వేణుగోపాల్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, బాల క్రిష్ణమ నాయుడు, సతీష్, మైఖేల్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

పెనుమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్లానింగ్ ఆఫీసర్ శాంబశివరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు సచివాలయాలను, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, ట్యాంకులను విధిగా శుభ్రం చేయించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డన్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ రమేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి, సెక్రటరీలు సునిత, హేమలత పాల్గొన్నారు.

వసంతాపురం-కొత్తపల్లె రోడ్డుకు రూ.1.69 కోట్లు మంజూరు

గుడిపాల, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతాపురం నుంచి కొత్తపల్లె వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 1.69 కోట్ల నిధులు మంజూరైనట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఏఈ ప్రసాద్ బుధవారం తెలియజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చిత్తూరు కల్చరల్, మే14(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర బుధవారం అత్యంత రమణీయంగా ముగిసింది. జాతర ముగింపు కార్యక్రమాల్లో సాయంత్రం ఐదు గంటలకు చెన్నై డిజే నవీన్ బృంద సభ్యులచే రోడ్ షో సంగీత ప్రదర్శన అలరించింది. చిత్తూరు హైరోడ్డు మాక్స్ సెంటర్ వద్ద సుస్వర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ప్రముఖ గాయని ప్రవిష్ట బృందంచే సంగీత సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది.

మృతుడి కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



వెదురుకుప్పం, మే 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని బుధవారం ఆ పార్టీ నాయకులు భరోసా ఇచ్చారు. కార్వేటినగరం మండలం కొటార్వేడుకు చెందిన గిరిబాబు(29) మంగళవారం రాత్రి కొల్లాగుంట ఏఏడబ్ల్యు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం కొటార్వేడుకు తరలించారు. టీడీపీ నేత రాజా పార్టీ శ్రేణులతో అక్కడికి చేరుకుని పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.20వేలు అందించారు.

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



వెదురుకుప్పం, మే 14(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19వ తేదీన ధ్వజారోహణంతో మొదలు కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, బుక్‌లెట్స్‌ను బుధవారం ఆవిష్కరించారు. డిప్యూటీ ఈవో నాగరత్నం, ఏఈవో రవి, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.